
గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన అధికారులు

రోడ్ల మరమ్మతుకు శ్రీకారం

కవాడిగూడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ దోమలగూడ అరవింద్‌నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం పనులతో గుంతల మయంగా మారిన రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'డ్రైనేజీ వేశారు.. మిగిల్చారు'. కథనానికి కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, ఏఈ సుప్రజ స్పందించారు. వెంటనే డ్రైనేజీ పైప్‌లైన్‌ల కోసం తవ్వి వదిలేసిన రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభించారు బుధవారం ఈ పనులను రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శులు ప్రభాకర గంగపుత్ర, కేశవ రాజు, బీజేపీ నేత శివరాజ్, వాటర్‌వర్క్స్ అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గత ఇరవై రోజులుగా గుంతల మయమైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల సమస్య పరిష్కారానికి కృషి చేసిన పత్రికా యాజమాన్యానికి వారు ధన్యవాదాలు తెలిపారు.

పథకాలను మంజూరు చేయాలి

● మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్

ముషీరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పింఛను, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, డబుల్ బెడ్‌రూం ఇండ్లకోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రజలకు పథకాలను వెంటనే మంజూరు చేయాలని భోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. బుధవారం ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌ను వినతి పత్రం అందజేశారు. కార్యాలయం చుట్టూ పలు మార్లు వచ్చి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.


సత్యనారాయణకు పురస్కారాన్ని బహూకరిస్తున్న తేజావత్ నాయక్

మానవజీవితానికి మార్గదర్శనం భగవద్గీత

చిక్కడపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితానికి మార్గదర్శనం చేసేది భగవద్గీత అని అసెంబ్లీ సెక్యూరిటీ ఏసీపీ తేజావత్ రాందాస్ నాయక్ అన్నారు. నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరిస్వామి ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్, గీతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం త్యాగరాయగానసభలో గీతా జయంతి మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భగవద్గీత పురస్కారాన్ని ప్రముఖ రచయిత గజవెల్లి సత్యనారాయణకు నాయక్ ప్రదానం చేసి మాట్లాడారు. సమావేశంలో నిర్వాహకులు బడేసాబ్, గంటామనోహర్‌రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, దామోదర్‌రావు, చంద్రప్రకాష్‌రెడ్డి, అంజనీకుమారి, సరోజినీదేవి, జ్ఞానప్రసూన తదితరులు పాల్గొన్నారు.


గీతాపారాయణం చేస్తున్న యర్రగొల్ల శ్రీనివాస్‌యాదవ్

ఆకట్టుకున్న గీతాపారాయణం, సంకీర్తన విభావరి

చిక్కడపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గీతాజయంతిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ప్రముఖ ఆధ్యాత్మిక గాయకుడు యర్రగొల్ల శ్రీనివాస్‌యాదవ్ చేసిని గీతపారాయణం, సంకీర్తనా విభావరి ఆకట్టుకుంది. శ్రీవేదభారతి సొసైటీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, ఆలయ ఈవో మాచర్ల దేవనాథం హాజరై శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్వతీశం, దేవదాసు, వెంకటరెడ్డి

ఎదురుచూపులు కవితాసంకలనం ఆవిష్కరణ

చిక్కడపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని కవిత్వం చైతన్యపరుస్తుందని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం అన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో కొసరాజు ఆర్తి, జాహ్నవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొసరాజు ఆర్తి జయంతి సందర్భంగా కొసరాజు సామ్రాజ్యం సంపాదకత్వంలో ప్రచురించిన 'ఎదురుచూపులు పుస్తకాన్ని' డాక్టర్ ఓలేటి పార్వతీశం ఆవిష్కరించారు. బైస దేవదాసు, డా. వై రామకృష్ణారావు, గుదిబండి వెంకటరెడ్డి, పులివర్తి కృష్ణమూర్తి, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, కొసరాజు బాబు రాజేంద్రప్రసాద్, పొత్తూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాల ఉపాధి రంగాల్లో శిక్షణ : సత్యవతి



ముషీరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సెట్విన్ ఇన్‌చార్జిగా బి.వి. సత్యవతి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం ఇందిరానగర్‌లోని సెట్విన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులకు స్వల్పకాల వ్యవధిలో వివిధ ఉపాధి రంగాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. లాప్‌ట్యాప్ సర్వీస్, ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, అకౌంటింగ్ ప్యాకేజ్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్, మొబైల్ సర్వీసింగ్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లో 3 నెలల నుంచి 6 నెలల లోపు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు తమ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు 8801709595 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

'హెబ్రోన్ చర్చి ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడొద్దు'

చిక్కడపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి ప్రతిష్టను దిగజార్చేలా ఎవరూ మాట్లాడొద్దని చర్చి సొసైటీ అధికారప్రతినిధి ఆర్. వీరాచారి సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఇతర చర్చిలవారు కూడా హెబ్రోన్ చర్చి గురించి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని, ఇది ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసేందుకు పోలీసులు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

రసాభాసగా డబుల్ బెడ్‌రూం తాళాల పంపిణీ

- తాళాలు అందజేయడానికి వచ్చిన అదికారులను అడ్డుకున్న బస్తీ వాసులు
- తాళాలు ఇవ్వకుండానే వెనుతిరిగిన వైనం
- అన్యాయం జరిగిందంటూ ఎల్ బీ నగర్ వాసుల ఆందోళన


తాళాలను పంపిణీ చేయడానికి వచ్చిన అధికారులతో వాగ్వాదానికి దిగిన బస్తీ వాసులు


తమకు అన్యాయం జరిగిందంటూ తమ వద్ద ఉన్న సాక్ష్యాధారాలను చూపిస్తున్న బస్తీ వాసులు

కవాడిగూడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ పరిధి లాల్‌బహదూర్ శాస్త్రినగర్ (ఎల్‌బి నగర్)లో బస్తీవాసులకు కేటాయించిన ఇళ్ల తాళాల పంపిణీ రసాభాసగా మారింది. ఎంతో కాలంగా నివాసం ఉంటున్న వారికి కాకుండా స్థానికేతరులకు పట్టాలు ఇచ్చి తమకు అన్యాయం చేశారని పలువురు తాళాల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసిన తర్వాతే లబ్ధిదారులకు తాళాలు ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. కొన్నేళ్లుగా బస్తీల్లో నివాసం ఉంటున్న వారికి గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి ఇచ్చింది. ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేసింది. కలెక్టర్ సమక్షంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, స్థానిక కార్పొరేటర్ రచనశ్రీ చేతుల మీదుగా పట్టాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అధికారులను ఇళ్లరాని కొందరు స్థానికులు అడ్డుకున్నారు. ఎల్‌బీనగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల వద్ద కుటుంబసభ్యులతో కలిసి ఆందోళనకు దిగడడంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. గాంధీనగర్ పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా బాధితులు ఎడంపెల్లి లక్ష్మి, బాలస్వప్న, నలగండ్ల విజయలక్ష్మి, దోర్నాల లక్ష్మమ్మ, నర్సమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు మొదటి సారి లిస్టు ప్రకటించే సమయంలో తమ పేర్లు ఉన్నాయని, ఫైనల్ లిస్టులో మాయం అయ్యాయని ఆరోపించారు. బస్తీ పెద్దలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై తమకు ఇళ్లను కేటాయించకుండా అన్యాయం చేశారని కన్నీటి పర్యంతం అయ్యారు. ఎల్బీనగర్‌లో అనేక సంవత్సరాలుగా బస్తీలో నివాసం ఉంటున్న వారిని, ఇళ్లు కూల్చే సమయంలో ఇంటి వద్ద ఫొటో దిగిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో చిన్న నాటి నుంచి ఉన్న తమను కాదని స్థానికేతరులకు ఇళ్లను కేటాయించడం దారుణమన్నారు. మరోసారి విచారణ చేపట్టి, తమకు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి



బర్కత్‌పుర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు కోరారు. సంస్థాగతంగా బలంగా ఉన్నప్పుడే ఎన్నికలలో ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీల నిర్మాణం ఉంటేనే పార్టీ పూర్తి స్థాయిలో బలోపేతమవుతుందన్నారు. బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గ్రేటర్‌పై కమలం జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు ఏడెల్లి అజయ్‌కుమార్, సి.కృష్ణగౌడ్, జె.శ్రీకాంత్, సందీప్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులను తొలగించడం అన్యాయం

● సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్


ఆర్టీసీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నేతలు, కార్యకర్తలు

రాంనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి.. పాతబస్సుల పేరుతో 5 వేల బస్సులను తొలగించడం అన్యాయమని, దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నేతలు అన్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని ఆర్టీసీ బస్సు భవన్ ముందు నేతలు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు చిన్న చంద్రన్న, కె.రమ, చంద్ర అరుణ, కె.సూర్యం, ఎం.హన్మేష్, ఎల్.ఎల్.పద్మ మాట్లాడారు. ఉచిత ప్రయాణం మహిళలకు మంచిదే కానీ, బస్సులను కుదించడం, కొత్తవి మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. ఉచిత బస్సు ద్వారా నష్టపోయిన ఆటో, మోటార్ డ్రైవర్స్‌కు ఆర్టీసీ ఉద్యోగాలలో అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

విగ్రహాలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై లేదు


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు పి.సాయిబాబా తదితరులు

రాంనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి విగ్రహాలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్‌పై లేదని, ఉంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల కష్టాలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి బలవంతంగా బకాయిలను వసూళ్లు చేస్తున్నాయని ఆరోపించారు. బోధనా ఫీజులు ఉపకార వేతనాల బకాయిలు చెల్లించి విద్యార్థుల కష్టాలను తీర్చాలన్నారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్ నాయకుడు ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి


హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి

చిక్కడపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తానని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి తెలిపారు. చిక్కడపల్లిలోని నగర గ్రంథాలయ సంస్థలో బుధవారం ఆయన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవరణలో ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆధునీకరణ పనులను ప్రారంభించారు. అనంతరం త్యాగరాయగానసభలో జరిగిన సభలో కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు. నగరంలో నూతన గ్రంథాలయ భవనాల నిర్మాణానికి, పాతభవనాల మరమ్మతులకు చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజలకు మెరుగైన గ్రంథాలయ సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. పోటీపరీక్షల అభ్యర్థులకు అవసరమయ్యే పుస్తకాలు సమకూరుస్తానని, గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా సహకారం అందిస్తానని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా. రియాజ్ మాట్లాడుతూ, నగరంలోని సిటీ సెంట్రల్ లైబ్రరీతోపాటు అన్ని శాఖ గ్రంథాలయాలను నగర గ్రంథాలయాల చైర్మన్‌తో పాటు సందర్శించి, పాఠకులతో మాట్లాడి అవసరమైన పుస్తకాలు సమకూర్చేందుకు యత్నిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్లుగా కేసీఆర్ తెలంగాణ ఉద్యమ ద్రోహులను పక్కనపెట్టుకుని ఉద్యమకారులను దూరం పెట్టారని విమర్శించారు. సేవా కార్యక్రమాలతోపాటు పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తూ గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తున్న ఉపేందర్‌రెడ్డికి నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ, జనగాంజిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్, శివరాజ్‌యాదవ్, గ్రంథాలయ ఉద్యోగ సంఘం నాయకులు అయోధ్య, మహేందర్, వెంకటేశ్, అవినాశ్‌రావు, ప్రతిభారెడ్డి, రామ్మోహన్, నరేందర్, వరప్రసాద్, శుక్లాదేవి,జంగారెడ్డి, సుకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ఆకాంక్షల ప్రతిరూపమే తెలంగాణ తల్లి విగ్రహం

● బీఆర్ఎస్ దుష్ప్రచారం చేయడం తగదు

● టీపీసీసీ కార్యదర్శి జీ.ఎన్.కేశవ్


తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను చూపించి మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి జీ.ఎన్.కేశవ్

రాంనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ ఆకాంక్షలకు ప్రతిరూపంగానే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని టీపీసీసీ కార్యదర్శి జీ.ఎన్.కేశవ్ పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేయడం తగదని అన్నారు. బుధవారం అడిక్‌మెట్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలోని కోట్లాదిమంది ప్రజల అభీష్టం ప్రకారమే తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించి, సచివాలయంలో ప్రతిష్ఠించారని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పులు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు నిరసన తెలియజేయడం రాజకీయ ఉనికి చాటుకోవడం కోసం తప్ప మరొకటి కాదని ఆయన ఆరోపించారు. తెలంగాణ తల్లి పట్ల బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే తమ పదేళ్ల పాలనలో విగ్రహాన్ని ఎందుకు ప్రతిష్ఠింపచేయలేదని ప్రశ్నించారు. కొంత మందికే పరిమితమైన బతుకమ్మ పండగను మొత్తం ప్రజలకు ఎలా అంటగడతారని ఆయన ప్రశ్నించారు.

బీసీలకు మోదీ ప్రభుత్వం పెద్దపీట

బర్కత్‌పుర, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తున్నదని ఉమ్మడి ఏపీ మున్సిపల్ కౌన్సిలర్ చాంబర్ మాజీ అధ్యక్షుడు గొరకపుడి చిన్నయ్య దొర అన్నారు. 2029లో జరిగే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే విజయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలంతా బీజేపీకి జై కొడుతున్నారని, మోదీ నాయకత్వాన్ని సమర్థిస్తున్నారని అన్నారు. బీసీ ఉద్యమనేత ఆర్. కృష్ణయ్యకు ఏపీ నుంచి బీజేపీ రాజ్యసభ సీటు కేటాయించిందన్నారు. బీసీలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో ఇది స్పష్టమవుతుందన్నారు. తెలంగాణలో బీజేపీ విజయాన్ని ఏ శక్తులు అడ్డుకోలేవని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో టీడీపీ, జనసేన, బీజేపీలు ప్రభంజనం సృష్టిస్తాయని అన్నారు.

రాష్ట్ర అవతరణ నాడే తెలంగాణ తల్లి వేడుకలు జరుపుకోవాలి

● సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రారెడ్డి

బర్కత్‌పుర, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ వేడుకలను జూన్ 2న జరుపుకోవాలని సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణలో ప్రతియేడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి వేడుకలు జరుపుకోవాలని ప్రకటించారని, ఇది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. బుధవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూన్ 2నే తెలంగాణ ఆవిర్భావ వేడుకలు, తెలంగాణ తల్లి వేడుకలు జరుపుకుంటే సమంజసంగా ఉంటుందన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, రైతులు, కార్మికుల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో నాయకులు ఎన్.ఆంజనేయులు, పి.లక్ష్మణ్, ఎస్.ప్రవీణ్, ఎస్.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన అలీనా దనీస్, షఫియా కుర్షిద్, అజిముద్దీన్ విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేసిన బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ చాంద్ పాషా, స్కూల్ చైర్మన్ సయ్యద్ జాఫర్

ఆత్మస్థైర్యానికి కరాటే దోహదం

● బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ చాంద్‌పాషా

ముషీరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కరాటే శరీర దారుఢ్యంతోపాటు ఆత్మస్థైర్యానికి దోహదపడుతుందని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మహ్మద్ చాంద్‌పాషా అన్నారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్, ఇందిరానగర్‌లోని మార్డినెంట్ హైస్కూల్ విద్యార్థులకు కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఫస్ట్ మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్ 2024 పోటీలు నిర్వహించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను స్కూల్ ప్రాంగణంలో అభినందించి, సర్టిఫికెట్లు, మెమోంటోలను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహ్మద్ చాంద్‌పాషా మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగాలపై దృష్టిసారించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం మెడల్స్ సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్డినెంట్ హైస్కూల్ చైర్మన్ సయ్యద్ జాఫర్, ప్రధాన ఉపాధ్యాయుడు సయ్యద్ ఇమ్రాన్, ఉపాధ్యాయులు పర్వీన్, గౌరీ, స్వర్ణలత, కరాటే మాస్టర్ షఫీ, ఆసీఫ్, నాయకులు అజిత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో సరుకులను అందుబాటులో ఉంచాలి

● కార్పొరేటర్ కన్నె ఉమాదేవి


కాచిగూడలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో అన్ని సరుకులను అందుబాటులో ఉంచాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి సూచించారు. బుధవారం నాంపల్లి నాల్గో సర్కిల్ ఏఎస్‌వో పుష్పలతతో కలిసి కాచిగూడ డివిజన్‌లోని రేషన్ షాపులను కార్పొరేటర్ తనిఖీ చేశారు. రేషన్ కార్డుదారులతో మాట్లాడి సరుకులు బాగా ఇస్తున్నారా రేషన్ షాపు సమయానికి తీస్తున్నారా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్డుదారులకు ఇబ్బందులు పెట్టవద్దన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, రామకృష్ణ, రవియాదవ్, నందు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలి

● మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్ రెడ్డి

ముషీరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్డును ఆధునీకరించాలని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని నందు మటన్‌షాపు వీధి నుంచి బాపూజీనగర్ వరకు గల రోడ్డును జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి వి.శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఇక్కడ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల నిర్మాణ పనులు చేపట్టి రోడ్డు వేయకుండా వదిలేశారని ఆరోపించారు. దీని వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందుల గురవుతున్నారని, ప్రమాదాలకు సైతం లోనవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం కోఆర్డినేటర్ కార్తీక్ యాదవ్, నాయకులు సాయి, అజ్జు, సిరిగిరి శ్యామ్, జీహెచ్‌ఎంసీ ఏఈ మురళీ పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సభ్యుడి మృతి


జి.యాదగిరిరావు (ఫైల్)

కవాడిగూడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులు జి, యాదగిరిరావు (60) గుండెపోటుతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. దోమలగూడ పూల్‌బాగ్‌లో నివాసం ఉండే యాదగిరిరావుకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతి పట్ల టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు ఎం అరవింద్‌కుమార్‌గౌడ్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్‌లు సంతాపం తెలిపారు. ఆయన అంత్య క్రియలు గురువారం ఉదయం జరుగుతాయని యాదగిరి రావు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362